సాక్షి సంగారెడ్డి
శనివారం : 3 : మే : 2025



బోధన వినూత్నం

మన భావితరాలకు సురక్షితమైన నివాసయోగ్యమైన భూమిని అందించడం మన కర్తవ్యం.. వివరాలు 10లో ▸



భళా.. చేనేత, హస్త కళా మేళా

జిల్లా కేంద్రం సంగారెడ్డిలో నిర్వహించిన చేనేత హస్త కళా మేళా పట్టణ ప్రజలను ఆకట్టుకుంటోంది. వివరాలు 10లో ▸



వైభవంగా బోరంచ జాతర..

బోరంచ నల్లపోచమ్మ ఆలయ ఏడువారాల జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వివరాలు 11లో ▸

రాజీవ్ యువ వికాసానికి 49,559 దరఖాస్తులు

వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం

- ఎంపీడీఓలకు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
- లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లా, మండల స్థాయిల్లో కమిటీలు
- జూన్ 2న లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీకి చర్యలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సాయం కోసం నిరుద్యోగ యువత పెట్టుకున్న దరఖాస్తుల క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించనున్నారు.

ఈ వెరిఫికేషన్ బాధ్యతలను ప్రభుత్వం ఆయా మండలాల ఎంపీడీఓలకు అప్పగించింది. నిరుద్యోగ యువత తన కాళ్ల మీద తాను నిలబడేలా చేయూత అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిన విషయం విదితమే. మొత్తం ఆరు రకాల యూనిట్లకు ఈ పథకం కింద సబ్సిడీల రూపంలో ఆర్థిక సాయం అందిస్తుంది. ఈ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 49,559 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అత్యధికంగా బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 22,264 దరఖాస్తులు రాగా, ఎస్సీ కార్పొరేషన్‌కు 13,735 దరఖాస్తులు, ఎస్టీ కార్పొరేషన్‌కు 4,004, మైనార్టీ కార్పొరేషన్‌కు సంబంధించి 8,653 దరఖాస్తులు, మిగిలిన 903 దరఖాస్తులు క్రిస్టియన్, ఈబీసీ కేటగిరీల దరఖాస్తులు ఉన్నాయి. ఈ దరఖాస్తులన్నింటికి క్షుణ్ణంగా పరిశీలించి.. ఇందులో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. లబ్ధిదారుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షల లోపు ఉన్న వారు అర్హులుగా ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది.

ఆరు క్యాటగిరీల్లో సబ్సిడీ సాయం

లబ్ధిదారులకు ఆరు క్యాటగిరీల్లో ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. రూ.50 వేల యూనిట్లకు వంద శాతం సబ్సిడీ ఇస్తుండగా, రూ.50 వేల నుంచి రూ.లక్ష లోపు యూనిట్లకు 90 శాతం సబ్సిడీ, రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల యూనిట్లకు 80 శాతం సబ్సిడీ, రూ.రెండు లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ ఇస్తారు. లబ్ధిదారులు మొత్తం 118 రకాల స్వయం ఉపాధి యూనిట్లు పెట్టుకునేందుకు వీలు కల్పించింది. చిన్న యూనిట్లు, ఇండస్ట్రియల్ సర్వీస్ యూనిట్లు, ఆగ్రో బేస్డ్ యూనిట్లు, పశుసంవర్థకం, చిన్ననీటి పారుదల, హార్టికల్చర్, ట్రాన్స్‌పోర్టు వంటి సెక్టార్లకు సంబంధించిన యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొంది.

కమిటీల్లో బ్యాంకర్లు

ఈ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యాక లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం మండల, జిల్లా స్థాయి కమిటీలను నియమించింది. ఎంపీడీఓ/మున్సిపల్ కమిషనర్ నేతృత్వంలో మండల స్థాయి కమిటీ లబ్ధిదారుల జాబితాను రూపొందిస్తుంది. కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. ఈ కమిటీల్లో ఆయా మండలాల స్పెషల్ ఆఫీసర్లు, బ్యాంకర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆర్థిక సంస్థల ప్రతినిధులు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. జూన్ 2న ఈ పథకం ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈలోగా ఈ ప్రక్రియలన్నింటిని పూర్తి చేసేలా అధికారులను ఆదేశించింది.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్

5 నుంచి రెవెన్యూ సదస్సులు

- పైలెట్ ప్రాజెక్టుగా ఒక మండలం
- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశం

సంగారెడ్డి జోన్: ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆమె సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని చెప్పారు. భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. జూన్ 2 వరకు పైలెట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని చెప్పారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ చలపతిరావు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా ఓటరు జాబితా

తప్పులు లేని ఓటరు జాబితా ప్రణాళిక బద్ధంగా రూపొందించాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమీక్షలె ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు ఫామ్7, చిరునామా మార్పు, పేరు సరిదిద్దేందుకు ఫామ్ 8 లను పరిశీలించి పూర్తి చేయాలన్నారు. ఒకే కుటుంబంలో ఉండే, ఒకే గేటెడ్ కమ్యూనిటీ లో ఉండే వారందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ఉండేలా ప్రణాళిక చేయాలని కోరారు.

నీట్ పరీక్ష కేంద్రాల పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాల్లో 3,320 అభ్యర్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. శుక్రవారం పట్టణంలోని పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. రవాణా, తాగునీరు, పార్కింగ్, టాయిలెట్, వైద్య శిబిరాలు పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి 1:30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు అనుమతి ఇస్తారన్నారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రానికి చేరుకునే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చర్యలు తీసుకోవాలని ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించారు. ఒకవేళ ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొన్నట్లయితే వెంటనే జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 56739కు సమాచారం అందించాలని కోరారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

క్షుద్రపూజలు కావు.. శాంతి హోమం

- బాలిక బలియత్నం అవాస్తవం
- సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐ, మహేశ్‌గౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని బీరువాలు తయారు చేసే కార్ఖానాలో క్షుద్ర పూజలు, బాలికను బలిచ్చే ప్రయత్నం జరిగిందంటూ వచ్చిన వార్తలు అవాస్తవమని డీఎస్పీ సత్తయ్యగౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం సీఐ మహేశ్‌గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేంద్ర 25 ఏళ్ల క్రితం వలస వచ్చి బీరువాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కొంతకాలంగా వ్యాపారం సరిగ్గా జరగక, ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడ్డాడు. దీంతో తమ రాష్ట్రానికి చెందిన మున్సిల్ అనే స్వామిజీని సంప్రదించగా.. శాంతిపూజ, లక్ష్మీపూజ నిర్వహిస్తే ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. దీంతో గత నెల 29న రాత్రి 8 గంటలకు పూజకు ఏర్పాట్లు చేశాడు. ఈ విషయం తన స్నేహితుడు బట్కరి ప్రభుకు తెలుపగా.. అతను కూడా తన కూతురితో కలసి పూజలో పాల్గొన్నాడు. శాంతిపూజకు సంబంధించిన వస్తువులు సకాలంలో చేరకపోవడంతో పూజ ఆలస్యం ప్రారంభమైంది. అయితే.. పూజల గురించి శబ్దాలు రావడంతో కొందరు ఫొటోలు, వీడియోలు తీసి పోలీసులకు పంపించారని తెలిపారు. సీఐ మహేశ్‌గౌడ్ అదే రోజు రాత్రి సంఘటన స్థలానికి వెళ్లి పూజ హోమం చేస్తున్న వారిని విచారించగా.. క్షుద్రపూజలు కావని శాంతి హోమం చేస్తున్నట్లు తేలిందన్నారు.

నకిలీ పత్తి విత్తనాలపై ప్రత్యేక నిఘా

డివిజన్ల వారీగా టాస్క్‌ఫోర్స్ కమిటీలు

సంగారెడ్డి జోన్: రైతులు నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నకిలీ విత్తనాలు తయారీ దారులతో పాటు సరఫరాను అడ్డుకోవడం, అమ్మకాలు జరగకుండా ఉండేందుకు అధికారులు గట్టి నిఘాను ఏర్పాటు చేయనున్నారు. రైతులకు తక్కువ ధరకు విత్తనాల ఆశ చూపి విక్రయిస్తుంటారు. వాటిని సాగు చేసిన తర్వాత మొలకెత్తకపోవడంతో పాటు దిగుబడి తగ్గిపోయి మోసపోతుంటారు. నకిలీ విత్తనాలు, నాణ్యతలేని విత్తనాలపై తనిఖీలు చేసేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాకు ఒకటి, ప్రతి డివిజన్ వారీగా టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విత్తనాల విక్రయ దుకాణాలలో తనిఖీలు చేపడుతారు.

రూ.200 కోట్లతో లింగంపల్లి వంతెన

5న ప్రారంభోత్సవం

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో సుమారు రూ.200 కోట్లతో నిర్మించిన ఫ్లై ఓవర్‌ను 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం పలు శాఖల అధికారులతో కలసి ఫ్లై ఓవర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా లింగంపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోడీ నాయకత్వంలో జాతీయ రహదారిని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు జాతీయ రహదారిని ఆరు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నామని, అందుకు సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. మెదక్, చేవేళ్ల పార్లమెంట్‌ను కలుపుతూ సంగారెడ్డి జిల్లాకు ముఖద్వారంగా ఉన్న ఈ ఫ్లై ఓవర్ హైదరాబాద్‌లోనే ప్రత్యేకతను చాటుకుంటుందని తెలిపారు. 5న సాయంత్రం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హెలికాప్టర్ ద్వారా ఇక్రిశాట్ ప్రాంగణానికి చేరుకుంటారని అక్కడ నుంచి 4 గంటలకు రోడ్డు మీదుగా ఫ్లై ఓవర్ వద్దకు చేరుకొని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇక్రిశాట్‌లోని హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ నేతలు రవికుమార్, నర్సింగ్ గౌడ్, రాంబాబు గౌడ్, సుధాకర్, సంతోష్, ఎండ్ల రమేశ్, జాతీయ రహదారుల రీజనల్ అధికారి కృష్ణప్రసాద్, ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఉప కమిషనర్ సురేశ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ రెడ్డిలు పాల్గొన్నారు.



ఇక్రిశాట్‌లోని హెలిప్యాడ్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎంపీ రఘునందన్ రావు



సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ జేఏసీ

స్పందించకుంటే సమ్మెకు దిగుతాం

ఆర్టీసీ జేఏసీ నాయకుల హెచ్చరిక

సంగారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ సంగారెడ్డి డిపో జేఏసీ చైర్మన్ ఎక్బాల్ పాషా తెలిపారు. శుక్రవారం సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జేఏసీ రాష్ట్ర నాయకుడు పీకే మూర్తితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకు దిగుతామని చెప్పారు. ఒకవేళ సమ్మె అనివార్యమైతే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ కోశాధికారి ఎంపీ గుర్రాజ్, ప్రచార కార్యదర్శి విక్రమ్, అడ్వైజర్ భూపాల్‌రెడ్డి, కోకన్వీనర్ ఎండీ అత్తర్ అలీ, తులసీ, అనిల్ కుమార్ అంజయ్య ఏడీసీ ఎస్ ఎం దాస్ తదితరులు పాల్గొన్నారు.

కలిసిరాని యాసంగి

- ఖరీఫ్‌తో పోల్చితే తగ్గిన పంట దిగుబడి
- ఎకరాకు 25 క్వింటాళ్లు కూడా రాని వైనం
- ఆందోళనలో అన్నదాతలు



వట్‌పల్లి(అందోల్): ఈసారి యాసంగి సీజన్ అన్నదాతలకు కలిసి రాలేదు. నాట్లు వేసిన రోజు మొదలుకొని పంట చేతికొచ్చేదాకా వరిపై చీడపీడలు దాడులు చేశాయి. కాండం తొలుచు పురుగు వంటి తెగుళ్ల పంటను దెబ్బతీశాయి. పంటను కాపాడుకోవడానికి రైతు పరిమితికి మించి మందులు పిచుకారి చేసినా.. ప్రయోజనం లేకుండా పోయింది. మందులు కొనుగోలు చేయడానికి అన్నదాతలు అప్పుల పాలయ్యారు. వ్యవసాయ పెట్టుబడులు పెరగడం రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేసింది. దీంతో పంట దిగుబడిపై ప్రభావం చూపింది. ప్రస్తుతం పంట చేతికి వస్తుండడంతో జిల్లా అంతటా వరి కోతలు ప్రారంభమయ్యాయి. దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు..ఎకరానికి 28 క్వింటాళ్లు రావాల్సిన ధాన్యం కేవలం 20- 22 క్వింటాళ్లు మాత్రమే వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. నాలుగైదు క్వింటాళ్లు నష్టపోతున్నామని వాపోతున్నారు.

95వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో 95,690 ఎకరాల్లో ఈ యాసంగిలో వరి పంటను సాగుచేశారు. తెగుళ్ల దాడి చేయడంతో దిగుబడిపై ప్రభావం చూపింది. వరి పంట సాగు చేయడంలో ఒక్కో రైతు ఎకరానికి రూ.22 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. దిగుబడి తగ్గడంతో వరి సాగు చేసిన రైతులకు పెట్టుబడి ఖర్చులు తలకు మించిన భారంగా మారి నష్టాలే మిగిలాయని రైతులు పేర్కొంటున్నారు. వరి సాగు ఖర్చులు బాగా పెరిగిపోయాయి. మూడేళ్ల క్రితం ఎకరానికి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పెట్టుబడి అయ్యేది. ఇప్పుడు దుక్కి మొదలుకొని మడి తయారీ విత్తనాలు చల్లడం, నాట్లు, ఎరువుల వేయడం, పురుగు మందుల పిచికారీ నుంచి పంట కోత వరకు ఎకరానికి రూ.22 వేల వరకు ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. పెరిగిన ఖర్చులో అధిక శాతం ఎరువులు, పురుగు మందులు, కూలి రేట్లు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుత దిగుబడులను బట్టి పెట్టుబడుల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీల బలోపేతం

- పక్కా భవనాలు, మౌలిక సదుపాయాలు
- ఒక్కో కేంద్రానికి రూ.లక్ష కేటాయింపు

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ప్రారంభించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉండడం, దీనికి తోడు కనీస సౌకర్యాల లేమితో అంగన్‌వాడీలు కొనసాగుతుండడంతో వాటిపై దృష్టి సారించింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పూర్తిస్థాయిలో కనీస సౌకర్యాలు కల్పించాని సంకల్పించింది. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు అక్షరజ్ఞానం నేర్పుతున్నారు. దీనితోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్య సలహాలు అందజేస్తున్నారు. కానీ కేంద్రాలు కనీస మౌలిక సదుపాయాలు లేక కొట్టుమిట్టాడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. రానున్న విద్యా సంవత్సరం లోపు కనీస సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. పక్కా భవనాలు లేని కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించనున్నారు.

అలాగే.. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించనున్నారు. జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట్, సదాశివపేట్, పటాన్‌చెరు ఐసీడీఎస్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1,04,106 మంది చిన్నారులు కేంద్రాలకు వస్తున్నారు. జిల్లాలో 359 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా వాటిలో కొన్ని పక్కా భవనాలు కాగా మరికొన్ని పాఠశాల, పంచాయతీ భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటితోపాటు అన్ని కేంద్రాల్లోనూ మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలన్నింటినీ ఒక్కో కేంద్రానికి రూ.లక్ష ఖర్చుతో కల్పించనున్నారు.



నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

జవాబుదారీ కోసం ట్యాబ్‌లు

అంగన్‌వాడీ టీచర్లు ఇదివరకు మొబైల్ ఫోన్లు సఫరా చేశారు. తక్కువ సామర్థ్యం ఉన్న ఫోన్లు కావడంతో వాటిద్వారా వివరాల నమోదు ఇబ్బందికరంగా మారింది. దీన్ని నివారించేందుకు వారికి 5జీ నెట్‌వర్క్‌గల ట్యాబ్‌లను ఇవ్వనున్నారు. ఒక్కో ట్యాబ్‌కు రూ.20వేలను ప్రభుత్వం వెచ్చించనుంది. ఈ ట్యాబ్‌ల ద్వారానే టీచర్లు, విద్యార్థులు, గర్భిణీలు, బాలింతల రోజు వారీ హాజరు, సరుకు రవాణా, చిన్నారుల బరువు, ఎత్తు, ఆరోగ్య సమచారం నమోదు చేయాల్సి ఉంటుంది. తద్వారా జవాబుదారీతనం పెరుగుతుందని భావిస్తున్నారు.

సదుపాయాలు కల్పిస్తున్నాం



మౌలిక సదుపాయాలు లేని కేంద్రాల వివరాలు తయారు చేసి కలెక్టర్‌కు సమర్పించనున్నాం. వచ్చే అకాడమిక్‌లోగా మౌలిక సదుపాయాల కల్పన జరగనుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల సెలవులు ప్రకటించారు. కేంద్రాల్లో భోజనం వండడం జరగదు. నేరుగా చిన్నారులు, లబ్దిదారుల ఇళ్లకే నెలకు సరిపడా సరుకులను అందజేస్తాం. సెలవు రోజుల్లో టీచర్లు, ఆయాలు రిపోర్టులు సమర్పించడం, ఫీల్డ్ వర్క్, పిల్లల సర్వే చేపట్టడం జరుగుతుంది.

– లలితకుమారి, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, సంగారెడ్డి

న్యూస్‌రీల్

ఉచిత పాలీసెట్ శిక్షణ

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ దరఖాస్తు చేస్తున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ప్రిన్సిపాల్ జానకి దేవి ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న పదవ తరగతి ఉత్తీర్ణత అయిన విద్యార్థులకు ఈనెల 5 నుంచి శిక్షణ ప్రారంభించనున్నారు. ఈ నెల 13వ తేదీన పరీక్ష ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గిరిజన యువకుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ప్రకాశ్

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని లాల్ సింగ్ నాయక్ తండాకు చెందిన రమావత్ ప్రకాశ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించాడు. క్రీడల విభాగంలో ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ పర్యవేక్షణలో మేల్ ఖోఖో ప్లేయర్స్ మోటార్ ఫ్లయింగ్ ఎబిలిటీ తదితర అంశాలపై పరిశోధన చేసి పుస్తకాన్ని రాశాడు. నిరుపేద కుటుంబం నుంచి క్రీడల విభాగంలో నూతన ఆవిష్కరణ చేసిన ప్రకాశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఉపాధ్యాయ సమస్యలను మండలిలో ప్రస్తావిస్తా

ఎమ్మెల్సీ అంజిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిరెడ్డి

జహీరాబాద్ టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం జహీరాబాద్‌లో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ డీఏ, పీఆర్‌సీలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బిల్లుల గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయమై శాసనమండలిలో మాట్లాడుతానని చెప్పారు. విద్యా, వైద్యం కీలకమైన శాఖలని, వీటికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని కోరారు. దేశహితం కోసం జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, తపస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హన్మంత్‌రావు, సురేష్, జహీరాబాద్ నాయకులు మల్లయ్యస్వామి, తుక్కప్ప, మొగులయ్య, మల్లయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి



పదోన్నతి పొందిన వారికి చిహ్నాన్ని అలంకరిస్తున్న డీఎస్పీ , సీఐ

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని పలు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నలుగురు కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతులు పొందారు. హద్నూర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మాణిక్, ఝరాసంగంకు చెందిన సుభాష్, జహీరాబాద్ టౌన్ పీఎస్‌లో పనిచేస్తున్న రాథోడ్ మోతీరాం. చిరాగ్‌పల్లికి చెందిన బాలకృష్ణలు హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి లభించింది. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి వల్ల విధుల పట్ల బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ టౌన్ సీఐ శివలింగం, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పిల్లలపై శ్రద్ధ వహించాలి

- జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



రికార్డులను పరిశీలిస్తున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య సూచించారు. సంగారెడ్డిలోని శిశు గృహ, సఖి, భరోసా కేంద్రాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారి బాగోగులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగించాలని, పిల్లలకు సరైన వసతులను అందించాలని చెప్పారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక


ఎంపికైన విద్యార్థినులు

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ధూల్మిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సంజన, మేఘన, శ్రావణి, ప్రణతి, సింధు ఎంపికైయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు 2 నుంచి 4 వరకు జగిత్యాల జిల్లాల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపికకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ సతీశ్‌ను పలువురు అభినందించారు.

మృతుడి ఆచూకీ లభ్యం


ఎల్లయ్య (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ధర్మారం గ్రామశివారులో గురువారం లభ్యమైన మృతదేహం ఆచూకీ లభ్యమైంది. మృతుడు మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన రాజుల ఎల్లయ్యగా పోలీసులు నిర్ధారించారు. తూప్రాన్ పట్టణానికి చెందిన ఓ పండ్ల వ్యాపారి వద్ద పని చేస్తున్నాడని, వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామ శివారులోని ఓ మామిడి తోటలో కాపలాగా ఉంచినట్లు గుర్తించారు. 29న మామిడి తోట నుంచి బయటకు వెళ్లి వడదెబ్బ కారణంగా ధర్మారం గ్రామ శివారులోని ఓ చెట్టు వద్ద మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

కుక్కల దాడిలో జింక మృతి


జింకను పరిశీలిస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన మండల పరిదిలోని చల్మెడ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. శుక్రవారం కుక్కలు జింకను వెంబడిస్తూ చల్మెడ గ్రామానికి చెందిన రైతు సంతోష్ రెడ్డి మామిడి తోటలోకి ప్రవేశించాయి. గమనించిన రైతు జింకను కుక్కల నుంచి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. స్థానిక పోలీసులు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిర్వహించి పూడ్చిపెట్టారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జైపాల్ రెడ్డి, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటి ఎదుట పార్కు చేసిన స్కూటీ దహనం


కాలిపోయిన స్కూటీ

దుబ్బాకటౌన్: ఇంటి బయట పార్కు చేసిన స్కూటీని గుర్తు తెలియని దుండగులు నిప్పంటించి దహనం చేశారు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డులో చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. చెల్లాపూర్ వార్డుకి చెందిన రాళ్లపేట శివ దినేశ్ తన స్కూటీని రోజు మాదిరిగానే గురువారం రాత్రి ఇంటి బయట పార్కు చేశాడు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంటి బయట పెద్ద శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూడగా స్కూటీ మంటల్లో కాలిపోయింది. కుటుంబ సభ్యులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే స్కూటీని దహనం చేశారని ఆరోపిస్తూ బాధితుడి తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శామీర్‌పేటలో తిమ్మాపూర్ వాసి మృతి


హనుమంతు (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామవాసి మేడ్చల్ జిల్లా మండల కేంద్రమైన శామీర్‌పేటలో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోచంపల్లి హనుమంతు(48) మృతదేహం శుక్రవారం మేడ్చల్ శామీర్‌పేట కట్ట మైసమ్మ ముందు బ్రిడ్జి కింద లభ్యమైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు శామీర్‌పేటకు వెళ్లి మృతదేహాన్ని చూసి విలపించారు. హనుమంతు మృతిపై అనుమానం ఉందని విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేతికి కాలుకు గాయాలు కావడంతో శామీర్‌పేట పోలీసులు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పర్యావరణం.. బోధన వినూత్నం


స్టాప్ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై విద్యార్థులకు అవగాహన

మన భావితరాలకు సురక్షితమైన నివాసయోగ్యమైన భూమిని అందించడం మన కర్తవ్యం.. పర్యావరణానికి(భూమికి) హాని చేసే పనులు చేయకుండా పరిరక్షణకు కృషి చేయడం మనందరి బాధ్యత అంటున్నారు మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ. ఆ దిశగా అడుగులు వేస్తూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ఇంటరాక్టీవ్, ప్రాజెక్ట్, ప్రయోగాత్మక పద్ధతుల్లో వినూత్నంగా బోధిస్తున్నారు. విద్యార్థులను నిత్యం చైతన్యపరుస్తూ తల్లి లాంటి భూమిని కలుషితం చేయకుండా కాపాడాలని తన వంతు ప్రయత్నం చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

– సదాశివపేట రూరల్(సంగారెడ్డి)

- ఇంటరాక్టీవ్, ప్రాజెక్ట్, ప్రయోగాత్మకంగా వివరణ
- కాలుష్యంతో కలిగే అనర్థాలపై సూచనలు, సలహాలు
- నీటి వృథాను అరికట్టడం, ప్లాస్టిక్ వాడకంపై అవగాహనలు
- పాఠశాలలో విరివిగా మొక్కలు నాటిస్తూ పలువురికి ఆదర్శం

పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటూ విద్యార్థులు స్వయంగా పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులు సైతం పర్యావరణంపై కార్యకలాపాలు, అసైన్మెంట్‌లను రూపొందించేలా ప్రోత్సహిస్తున్నారు. పర్యావరణానికి హాని కల్గించే అంశాలను పరిశోధించి, సమస్యను ఎంచుకొని, పరిష్కారం కోసం ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. పర్యావరణానికి సంబంధించిన ప్రదేశాలకు విద్యార్థులను తీసుకెళ్లి అక్కడ జరుగుతున్న విషయాలను ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. పర్యావరణంపై వినూత్నంగా చేస్తూ విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్నారు.

స్టాప్ సింగిల్ యూస్ ప్లాస్టిక్

ప్లాస్టిక్‌ను వాడేటప్పుడు 5ఆర్ ఐనా రిఫ్యూజ్, రెడ్యూస్, రీయూస్, రీసైకిల్, రోట్లను గుర్తు చేస్తున్నారు. ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు, కవర్లు, పేపర్లు బదులుగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు, జ్యూట్ బ్యాగులు, బట్టలు వాడమని ఒకేసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని చూపిస్తూ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.



పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ కృషి



నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ

నీటి వృథాను అరికట్టేలా..

నీటిని వృథా చేయకుండా ప్రతీ ఇంటిలోనూ వర్షాలు వచ్చినప్పుడు ఆ నీటిని మరలా వాడుకోవటానికి నీటిని నిల్వ చేసే నిర్మాణం, ఇంటిలో ఉన్న నల్లాల ద్వారా నీరు వృథా కాకుండా ఎలా చేసుకోవాలో తెలియజేస్తున్నారు. భూగర్భ జలాలను పెంచడానికి ఇంకుడు గుంతలు ఎలా నిర్మించాలో వివరిస్తున్నారు. పంట పొలాలు, తోటల్లో డ్రిప్ ఇరిగేషన్, ఆధునిక టెక్నాలజీ ద్వారా వాటర్‌ను వాడుకోవాలని తెలిపారు.

తడి, పొడి చెత్త వేరు విధానం

రోజువారి ఇంటిలో నుంచి వెలువడే చెత్తలో ఉండే పేపర్లు, ప్లాస్టిక్, ఆర్గానిక్, ఎలక్ట్రానిక్ లాంటి వస్తువులను అంశాల వారీగా వేరు చేసి చెత్త బుట్టల్లో ఎలా వేయాలో తడి,పొడి చెత్త వేరు చేసే విధానాన్ని ప్రాక్టికల్ గా వివరిస్తున్నారు.

ఆల్టర్నేటివ్ ఎనర్జీ రిసోర్సెస్..

అంతరించని శక్తి వనరులైన పవన, సూర్యరశ్మి శక్తులను ప్రత్యామ్నాయ శక్తి వనరులుగా విరివిగా వాడుకోవాలని తద్వారా తరిగి పోయే శక్తి వనరులను కాపాడుకోవాలని తెలియజేస్తున్నారు.

కంట్రోలింగ్ ఎయిర్ పొల్యూషన్..

గాలి కాలుష్యం వల్ల కలిగే నష్టాలు, కాలుష్యానికి గల కారణాలను తెలిపి అదుపులో ఉంచడానికి అవసరమయ్యే సూచనలు తెలియజేస్తున్నారు. ఎక్కువగా వాహనాల నుంచి వెలువడే పొగ వల్ల గాలి కాలుష్యం జరుగుతుందని చెబుతున్నారు. కాలుష్యాన్ని అదుపులో ఉంచుకోవడానికి నడక, సైకిల్, బస్సులు, రైళ్ల ద్వారా ప్రయాణం చేయాలని, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగస్తులు కార్ పూలింగ్ ద్వారా వెళ్లాలని, పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలు కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేస్తున్నారు.

మొక్కలు నాటించడం

పాఠశాల తనిఖీ, సందర్శనకు వచ్చే అధికారులతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిస్తూ అందులో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నారు. పేరెంట్స్ టీచర్స్ సమావేశాల్లో విద్యార్థులతో మొక్కల వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు. విద్యార్థులను క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లినప్పుడు ప్రకృతి మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

రామకృష్ణ కృషి అభినందనీయం



పర్యావరణ కాలుష్యంతో కలిగే అనర్థాలపై ఇంటరాక్టీవ్, ప్రాజెక్ట్, ప్రయోగాత్మక పద్ధతుల్లో వినూత్నంగా విద్యార్థులకు బోధిస్తూ వారిని చైతన్య పరచడం అభినందనీయం. పర్యావరణ పరిరక్షణకు బాధ్యతతో కృషి చేస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ, తోటి ఉపాధ్యాయులు సునీత, నవనీతలను అభినందిస్తున్నాను.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

మంజీరా వాగులో దూకి యువకుడు ఆత్మహత్య


నవీన్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): మంజీరా వాగులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ శివారులో చోటు చేసుకుంది. శుక్రవారం స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని చండూర్ గ్రామానికి చెందిన గుట్టమీది నవీన్ (28) కొడిపల్లిలో గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి కూలీ పనులకు వెళ్లేది. భార్య (క్యాన్సర్) అనారోగ్యంతో బాధపడుతుండగా మనస్తాపం చెంది మంజీరా వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్ట్‌మార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్‌ఐ నర్సింలును వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

చేగుంట(తూప్రాన్): భార్య కాపురానికి రావడం లేదని ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన చేగుంట జీవిక పరిశ్రమలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. బీహార్ రాష్ట్రం వైశాలీ జిల్లా కైజా గ్రామానికి చెందిన నందూలాల్ చౌదరీ(28) ఇటీవల చేగుంట జీవిక పరిశ్రమలో పని చేసేందుకు వచ్చాడు. పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన లేబర్ గదిలో ఉంటున్నాడు. నందూలాల్‌కు ఏడాది కిందట వివాహం కాగా భార్య కాపురం చేయడం లేదని తరుచూ బాధ పడుతుండేవాడు. శుక్రవారం రాత్రి నందూలాల్ పరిశ్రమలోని గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేగుంటలో నివాసం ఉంటున్న మృతుడి పెద్దనాన్న కుమారుడు విరుజ్ చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతుడి బంధువులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు


టెండర్లను నిర్వహిస్తున్న ఆలయ ఈవో అన్నపూర్ణ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శుక్రవారం సెల్‌ఫోన్ భద్రపరుచుకునే లైసెన్సు హక్కు కోసం, సీసీ కెమెరాల నిర్వహణ, షాపింగ్ కాంప్లెక్స్‌లో తాత్కాలికంగా వ్యాపారం చేసుకునేందు, పాత ఇనుప సామగ్రి విక్రయించేందుకు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలములు నిర్వహించారు. టీటీడీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 2వ నంబర్ గల షాపునకు నెలకు ఒక్కంటికి రూ.7,400 హెచ్చుపాట పాడి పీ.నర్సింహులు దక్కించుకోగా, సెల్‌ఫోన్ భద్రపరుచుకునే లైసెన్స్ హక్కును అయినాపూర్‌కు చెందిన దండు రవి రూ.15,20,000 హెచ్చు పాట దక్కించుకున్నారు. ఆలయంలోని పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేసేందుకు రాజు కిలో ఒక్కంటికి రూ.28 హెచ్చు పాటపాడి దక్కించుకోగా సీసీ కెమెరాల నిర్వహణ హక్కును రఘుపతి ఆలయ అధికారుల ఎస్టిమేట్ పై 4 శాతం తక్కువ కోడ్ చేసి హక్కును దక్కించుకున్నట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు ,టెండర్‌దారులు తదితరలు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రులు


ఆస్పత్రిలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న అజయ్‌కుమార్, ఇతర అధికారులు

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్
- దుబ్బాకలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రి తనిఖీ

దుబ్బాక : కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యం అందించేలా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రిని పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పన్యాల శ్రావణ్ కుమార్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతోపాటు పక్కనే ఉన్న రైతుల పొలాల్లోకి నీరు వెళ్తుండటాన్ని గమనించి నెల రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ తయారీ ప్లాంట్‌ను త్వరలోనే వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ డాక్టర్ తోపాటు చాలా ఖాళీలు ఉండటంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని, అలాగే పలు సమస్యలను సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్ కమిషనర్ దృష్టికి తేవడంతో వెంటనే స్పందించి త్వరలోనే భర్తీ చేస్తామని హామీనిచ్చారు. రోగులు ప్రైవేట్‌కు వెళ్లకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. డెలివరీల శాతం పెంచాలన్నారు. ఆస్పత్రి కార్పొరేట్‌కు దీటుగా ఉందని ప్రత్యేకంగా ప్రశంసించారు. పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాక ఆస్పత్రి సమస్యలను వైద్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సూచన మేరకు కమిషనర్ రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి దారుణహత్య

- మృతదేహంపై పెట్రోల్ పోసి తగులబెట్టిన వైనం
- ములుగు మండలం బస్వాపూర్‌లో ఘటన

ములుగు(గజ్వేల్): గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలం బస్వాపూర్ శివారులో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. ములుగు మండలం బస్వాపూర్ శివారులో ఓ యువకుడిని పెట్రోల్ పోసి తగులబెట్టి హతమార్చినట్లు శుక్రవారం ఉదయం గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. వెంటనే గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్‌ఐ విజయ్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని హతుడి ఎడమ చేతిపైన జ్యోతి, ఛాతిపైన స్టిల్ ఎండ్ మై లైఫ్ తదితర టాటూస్(పచ్చబొట్లు)ను పోలీసులు గుర్తించారు. అంతకు మించి ఆధారాలు దొరకలేదు. మృతదేహం పూర్తిగా కాలిపోయి ఉండటంతో ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఎవరైనా మృతున్ని గుర్తిస్తే 87126 67336, 94405 52391 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఎల్లయ్య మతదేహం

హత్నూర(సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన హత్నూర మండలం దౌల్తాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. హత్నూర మండలం గుండ్ల మాచ్నూర గ్రామానికి చెందిన జక్కుల ఎల్లయ్య(65) గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం పోలీసులు దౌల్తాబాద్ శివారులో జక్కుల ఎల్లయ్య మృతి చెంది ఉన్నట్లు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వెళ్లి మృతదేహాన్ని గుర్తించి బోరున విలపించారు. అనుమానాస్పద స్థితిలో ఎల్లయ్య మతి చెందడంతో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కూలీ పనులకొచ్చి వ్యక్తి అదృశ్యం

తూప్రాన్: కూలీ పనుల కోసం వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని నర్సంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సంపల్లి శివారులో ఫామ్‌హౌస్ నిర్మాణం కోసం బీహార్‌కు చెందిన కూలీలు పని చేస్తున్నారు. వీరిలో దేవేంద్ర భగత్(39) గురువారం కూలీ పనులు చేస్తున్న సమయంలో కల్లు తాగి వస్తానని తోటి కూలీలతో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫామ్‌హౌస్ యజమాని సుబ్రమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం


సీఐకి వినతిపత్రం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

- ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి
- పోలీసులకు దళిత సంఘాల నాయకుల ఫిర్యాదు

చేర్యాల(సిద్దిపేట): మతి స్థిమితం లేని దళిత యువకుడిపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పలువురు దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐకి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. మండల పరిధిలోని వేచరేణి శివారు ఎల్లదాసునగర్ బేడ బుడగ జంగాల కులానికి చెందిన ఊపిరి అజయ్‌కుమార్‌కు మతి స్థిమితం సరిగాలేదన్నారు. ఇటీవల యువకుడిపై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌కు సంబంధించిన వ్యక్తులు సభ్య సమాజం తలదించుకునేలా కాళ్లు చేతులు కట్టి, కర్రలతో కొడుతూ, నగ్నంగా ఊరేగిస్తూ దాడి చేయడం దారుణమన్నారు. అలాంటి వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఐని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మల్లిగారి యాదగిరి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రామగళ్ల నరేశ్, టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగా రాజేందర్, కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సనవాల ప్రసాద్, అంబేడ్కర్ సంఘం నాయకులు జేరిపోతుల పరుశరాములు, మల్లిగారి రాజు, షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి నాయకుడు బుట్టి భిక్షపతి, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కొండ్ర మల్లేశ్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మల్యాల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడు మధుకర్, ప్రేమ్‌కుమార్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

భళా.. హస్త కళా మేళా

సంగారెడ్డి : జిల్లా కేంద్రం సంగారెడ్డిలో నిర్వహించిన చేనేత హస్త కళా మేళా పట్టణ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేయగా వివిధ కాల చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచారు. పోచంపల్లి, నారాయణపేట, గద్వాల, వరంగల్, ఉప్పాడ, కంచి, ధర్మవరం, సిద్దిపేట, వెంకటగిరి చీరలు, కాటన్ చీరలు, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, టవల్స్, కాటన్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, కర్టెన్లు, భారీ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయి. హస్త కళ వస్తువులైన కొండపల్లి, ఏటికొప్పాక, నిర్మల్ బొమ్మలు, మైసూర్ రోజ్వుడ్ వస్తువులు, వరంగల్ లెదర్స్, బంజారా ఎంబ్రాయిడరీ, హైదరాబాద్ పెరల్స్, బ్యాంగిల్స్, చెక్క వస్తువులు, బ్లాక్ మెటల్స్, పెంబర్తి, ఇత్తడి వస్తు వులు, ఖాదీ గ్రామోద్యోగ్, హెర్బల్ ఉత్పత్తులు, మైసూర్ ఆగర్బత్తి, బెంగాలీ జూట్ బ్యాగులను నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. వస్తువులను కొనేందుకు మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహం చూపుతున్నారు.


హస్తకళా మేళాలో ప్రదర్శించిన వస్తువులు



